సాక్షి
కాకినాడ

బుధవారం । 18 । సెప్టెంబర్ । 2024



అన్నదాన భవనానికి విరాళం


ఆత్రేయపురం: వాడపల్లిలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవనానికి బోను నాగమణి (గుంటూరు జిల్లా) రూ.50,101 విరాళం అందించారు.



నిత్యాన్నదానానికి రూ.6 లక్షలు

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి పోతుగుంట శ్రీలక్ష్మి (హైదరాబాద్) మంగళవారం రూ.ఆరు లక్షల విరాళం సమర్పించారు. ఏటా సెప్టెంబర్ 26న దాత పేరు మీద అన్నదానం చేయాలని కోరారు.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం సాయంత్రం 2,39,240 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.90 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 13,400 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

ఘనంగా విశ్వకర్మ జయంత్యుత్సవం



విశ్వకర్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్ షణ్మోహన్ తదితరులు

కాకినాడ సిటీ: జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో విశ్వకర్మ జయంత్యుత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కలెక్టర్ షణ్మోషన్, సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల ప్రజలు విశ్వకర్మ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సిటీ ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విశ్వకర్మ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం శుభ పరిణామన్నారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఎం.లల్లి, కాకినాడ, పెద్దాపురం అసిస్టెంట్ సంక్షేమ అధికారులు ముత్యాల సుబ్బారావు, ఎస్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

174 అర్జీల స్వీకరణ

కాకినాడ సిటీ: కలెక్టరేట్‌లోని వివేకానంద హాలులో మంగళవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమానికి 174 అర్జీలు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలు రెవెన్యూ, పింఛన్లు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, టిడ్కో గృహాలు, ఇళ్ల స్థలాలు, భూమి వివరాల ఆన్‌లైన్ నమోదు, ఆక్రమణలు తొలగింపు, డ్రైనేజీల్లో పూడికలు, పారిశుద్ధ్యం, సదరం సర్టిఫికెట్లు తదితర సమస్యలపై వీటిని అందించారు. కలెక్టర్ షణ్మోహన్, డీఆర్వో డి.తిప్పేనాయక్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, సీపీవో పి.త్రినాథ్, జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు అందించిన అర్జీల పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు ఆదేశించారు. జిల్లాలో అధిక వర్షాలు, వరదల కారణంగా పది రోజులుగా అర్జీల పరిష్కారాల ప్రగతిపై సమీక్ష నిర్వహించలేదని, ఈ నెల 28వ తేదీన ఈ కార్యక్రమం జరుపుతామన్నారు. వివిధ శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్ష దరఖాస్తులకు గడువు పెంపు



రామకృష్ణయ్య, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్

పెద్దాపురం: పెద్దాపురం జవహర్ నవోదయ విద్యాలయలో 2025–26లో ఆరో తరగతి ప్రవేశ పరీక్ష దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 23వ తేదీ వరకు పొడిగించినట్లు విద్యాలయ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య తెలిపారు. ఆయన మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ ఆరో తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాలలోని 43 మండలాలలో ప్రభుత్వ, గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల్లో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్షలకు అర్హులన్నారు. 2025 జనవరి 18న మూడు జిల్లాల్లోని సుమారు 45 కేంద్రాల్లో పరీక్ష జరుగుతుందన్నారు. నవోదయ డాట్ జీఓవీడాట్‌ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా కాకినాడ, జగ్గంపేట, కోనసీమల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో మిలిగిన సీట్లకు నాలుగో విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా అడ్మిషన్ల కన్వీనర్ ఎం.వేణుగోపాలవర్మ మంగళవారం ఇక్కడ తెలిపారు. ఈ నెల 26వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. అభ్యర్థి చేరదలచిన ఐటీఐ కళాశాలను ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు కాకినాడ ప్రభుత్వ ఐటీఐ లేదా సమీపంలో ప్రైవేట్ ఐటీఐలో 27వ తేదీన సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. ఏమైనా సందేహాలుంటే 0884–2348182 నంబరుకు సంప్రదించవచ్చన్నారు. కౌన్సెలింగ్ ప్రభుత్వ ఐటీఐలకు 28న, ప్రైవేట్ ఐటీఐలకు 30న నిర్వహిస్తారని తెలిపారు.

హాస్టల్ విద్యార్థులకు ఆరోగ్య బీమా

అమలాపురం రూరల్: జిల్లాలో వివిధ సంక్షేమ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు, అనాథలకు ఆరోగ్య బీమా కోసం వివిధ కంపెనీలతో చర్చిస్తామని కలెక్టర్ మహేష్ కుమార్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన బ్యాంకర్ల సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ ఆధ్వర్యంలో ఆరోగ్య బీమా రూపకల్పనపై చర్చించారు.

సర్కారు వారి కోత

- పంట నష్టపరిహారం తగ్గించే యోచన!
- అంచనాల కుదింపు
- ప్రాథమిక అంచనా 80 వేల ఎకరాలు
- ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన నష్టం 65 వేల ఎకరాలు
- వ్యవసాయశాఖ తాజా అంచనా 36,941 ఎకరాలు



ఇటీవల వచ్చిన వరదలకు పిఠాపురం మండలంలో ముంపునకు గురైన పంట పొలాలు

సాక్షిప్రతినిధి, కాకినాడ: ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతులను అధిక వర్షాలు, వరదలు అనుకోని దెబ్బతీశాయి. చేతికందుతుందనుకున్న పంటంతా మునిగిపోయింది. రోజుల తరబడి నీరు నిలిచిపోవడంతో వరి దబ్బులు కుళ్లిపోయాయి. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన రైతులు ఏం చేయాలో తెలియక సతమతమవుతున్నారు. ఈ సమయంలో ప్రభుత్వం వారికి అండగా ఉండాలి. వెన్నుతట్టి ప్రోత్సహించి ముందుకు నడిపించాలి. కానీ కూటమి ప్రభుత్వం దానికి విరుద్ధంగా వ్యవహరిస్తోంది. పీకల్లోతు కష్టాల్లో ఉన్న ఏలేరు ముంపు రైతులను ఉదారంగా ఆదుకోవాల్సిన ప్రభుత్వం..దానికి భిన్నంగా నష్టపరిహారాన్ని తగ్గించేందుకు ఎత్తులు వేస్తోంది. నష్టం అంచనాలలో సగానికి సగం కోతలు పెట్టేందుకు ప్రయత్నిస్తోందని రైతులు గగ్గోలుపెడుతున్నారు.

హడావుడిగా అంచనాలు

చంద్రబాబు వచ్చి వెళ్లాక వ్యవసాయ శాఖ హడావుడిగా నష్టం అంచనాలు రూపొందించింది. అధికారులు ప్రారంభంలో రూపొందించిన నష్టం అంచనాలు, ముఖ్యమంత్రి వెల్లడించిన నష్టం లెక్కలు, ఇప్పుడు అధికారికంగా ప్రకటించిన అంచనాలకు అసలు పొంతనే కుదరకపోవడం విస్మయానికి గురి చేస్తోంది. ఒక వేళ ఇవన్నీ అంచనాలు అనుకున్నా కొద్దిగా అటు ఇటుగా రెండు, మూడు వేల ఎకరాల వ్యత్యాసం ఉంటుందే తప్ప ఇంత తేడా ఎందుకొస్తుందని రైతు సంఘాల ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు. ఈ అంచనాలు చూస్తుంటే నష్టం అంచనాల్లో సగం కోత పెట్టి పరిహారం అందించే ప్రక్రియను కుదించే పరిస్థితులు కనిపిస్తున్నాయని రైతులు అనుమానిస్తున్నారు. వ్యవసాయశాఖ రూపొందించిన తుది అంచనాలను బట్టి చూస్తే 36,941 ఎకరాల్లో మాత్రమే నష్టం సంభవించినట్టు ఉంది. అంటే ముందుగా వేసిన నష్టం అంచనాల్లో సగానికి పైనే కోత పెట్టినట్టు స్పష్టమవుతోంది. రెండు, మూడు రోజుల్లో జాబితాలు ప్రదర్శిస్తారని, ఎవరైనా మిగిలి ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చంటూ రైతులను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారంటున్నారు.

బాబు మాయమాటలు

పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల నష్టపరిహారం ఇస్తామన్న చంద్రబాబు రాజుపాలెంలో మాటలు ఇంతవరకూ ఆచరణలోకి రాలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు ప్రత్యేక జీఓ విడుదల చేస్తేనే తప్ప ఎకరాకు రూ.10 వేలు పరిహారం ఇవ్వడం సాధ్యం కాదు. ప్రస్తుతం అమలులో ఉన్న మార్గదర్శకాల ప్రకారం నష్ట పరిహారం ఎకరాకు రూ.6,800 మించి ఇవ్వడానికి లేదు. ఇందుకు అనుగుణంగానే అధికారులు లెక్కలు తయారు చేస్తున్నారు. చంద్రబాబు రూ.10 వేలు ప్రకటించి వారం కావస్తున్నా ఇంతవరకూ జీఓ విడుదల చేయకపోవడాన్ని రైతులు ప్రశ్నిస్తున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నష్ట పరిహారం ప్రకటించిన రోజే నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక జీవో విడుదల చేసిన సందర్భాలు ఉన్నాయి. చంద్రబాబు, కూటమి నేతలు సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలకు పట్టిన గతే పంట నష్ట పరిహారానికి పడుతుందనే అనుమానాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు. మొదట్లో పంట నష్టాలను బట్టి చూస్తే రూ.80 కోట్లు, చంద్రబాబు చెప్పిన పంట నష్టం 65 వేల ఎకరాల్లో అనుకుంటే రూ.65 కోట్లు నష్ట పరిహారం అందించాలి. తాజాగా వ్యవసాయశాఖ రూపొందించిన నష్టం అంచనాల ప్రకారం చూస్తే సుమారు రూ.36 కోట్లు విడుదల చేస్తే సరిపోతుంది. ఆ మేరకు ప్రభుత్వం తగ్గే 50 శాతం భారం చూసుకుంటుందే తప్ప, ఎకరాకు జరిగిన రూ.25 వేల నష్టంలో తమ కష్టాన్ని చూడటం లేదని రైతులు వాపోతున్నారు. అలాగే ముంపులో ఉన్న పంట పొలాల వద్దకు వెళ్లిన అంచనా బృందాలు జియో ట్యాగింగ్ చేసి మొత్తం పొలం నష్టపోయినట్టు నమోదు చేశామని రైతులను మభ్యపెడుతున్నారంటున్నారు.

ఇసుక మేటలకూ..

ఇసుక మేటలు వేసిన పొలాల అంచనాల్లోనూ కోతలు వేస్తున్నట్టుగా కనిపిస్తోంది. ఏలేరు కాలువకు గండ్లు పడిన పిఠాపురం మండలం రాపర్తి, రాయవరం, గొల్లప్రోలు మండలాల్లోని పలు ప్రాంతాల్లోని సుమారు 500 ఎకరాల్లోని వరి పొలాల్లో రెండడుగుల మేర ఇసుక మేటలు వేసింది. ఇలా జరిగిన పొలాల్లో ఒక్క దుబ్బు కూడా పనిచేయదనే విషయం క్షేత్ర స్థాయిలో పరిస్థితి చూస్తే స్పష్టమవుతుంది. అయితే వ్యవసాయశాఖ మాత్రం 74 ఎకరాలలోనే ఇసుక మేటలు వేసిందని లెక్క తేల్చింది. పంట పొలాల్లో వేసిన ఇసుక మేటలు మూడు అంగుళాలు దాటి ఉంటేనే పరిహారం వస్తుందనే నిబంధనలతో బాధిత రైతులు కన్నీటిపర్యంతమవుతున్నారు. ఇసుక మేటలు వేసిన పంట పొలాల(ఎకరానికి)కు ఇవ్వనున్న నష్ట పరిహారానికి, ముంపునకు గురైన పంట పొలాలకు ప్రస్తుత మార్గదర్శకాల మేరకు ఇచ్చే పరిహారానికి తేడా కేవలం రూ.400 మాత్రమే కావడం గమనార్హం. పంట ముంపునకు గురైతే ఇచ్చే పరిహారం రూ.6,800 కాగా, ఇసుక మేటలు వేసిన వరి పొలాలకు రూ.400 అదనంగా ఇస్తారు. అంటే ఎకరాకు రూ.7200 చొప్పున అందజేస్తారు. ఈ పరిహారం పొలాల నుంచి ఇసుక మేటలు తీయడానికి కూడా సరిపోదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెక్కల కష్టం నీటి పాలు



కొత్తపల్లి మండలం రమణక్కపేటలో చెరువులా మారిన పొలాలు (ఫైల్)

ఏలేరు ప్రాజెక్టు పరిధిలో రైతులు మునుపెన్నడూ లేని రీతిలో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఒక సీజన్‌లో పంటను పూర్తిగా కోల్పోయారు. వంద, రెండు వందల మంది కాదు ఏకంగా 40 వేల మంది రైతుల రెక్కల కష్టం నీటిపాలైంది. వారు కోల్పోయిన పంట నష్టం రూ.కోట్లలోనే ఉంటుంది. రైతులు ఎకరాకు రూ.25 వేలు తక్కువ కాకుండా పెట్టుబడి పెట్టేశాక పంటలు ముంపు బారిన పడ్డాయి. కిర్లంపూడి, ఏలేశ్వరం, ప్రత్తిపాడు, జగ్గంపేట, పెద్దాపురం, పిఠాపురం, కరప, సామర్లకోట, గొల్లప్రోలు, ఉప్పాడ కొత్తపల్లి, తొండంగి, తుని మండలాల్లో వరిపంటకు భారీ నష్టం వాటింది. వీటిలో అత్యధికంగా పిఠాపురం, పెద్దాపురం, జగ్గంపేట నియోజకవర్గాల్లో పిఠాపురం, గొల్లప్రోలు, ఉప్పాడ కొత్తపల్లి, కిర్లంపూడి, పెద్దాపురం, సామర్లకోట తదితర మండలాల్లో పంటలు ముంపులో చిక్కుకున్నాయి. ఈ రకంగా సుమారు 80 వేల ఎకరాల్లో వరి ఇతర వాణిజ్య పంటలు ముంపునకు గురయ్యాయని యంత్రాంగం ప్రాథమికంగా నిర్ధారించింది. ముంపు బాధితులను పరామర్శించడానికి కిర్లంపూడి మండలం రాజుపాలెం వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఏలేరు పరిధిలో 65 వేల ఎకరాల్లో పంట నష్టం సంభవించినట్టు వెల్లడించారు. ఎకరాకు రూ.10 వేలు నష్టపరిహారం అందిస్తామని చెప్పారు.

నష్టపరిహారం పూర్తిగా ఇప్పించాలి



ఐదు ఎకరాల్లో వరిపంట వేశాను. వరద కారణంగా పూర్తిగా మునిగిపోయింది. ఇప్పటికే ఎకరాకు రూ.23 వేలు చొప్పున రూ.1.15 లక్షల వరకూ అప్పు చేసి పెట్టుబడి పెట్టాను. కానీ ప్రభుత్వం మునిగిన పంటకు ఎకరాకు రూ.10 వేలు ఇస్తానని ప్రకటించింది. ప్రభుత్వం పూర్తి స్థాయిలో పంట నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలి.

– పాటంశెట్టి తమ్మారావు, బూరుగుపూడి, కిర్లంపూడి మండలం

కుళ్లిపోయిన వరి దుబ్బులు



ఏలేరు కాలువను ఆధునీకరించకపోవడం వల్ల వరద కారణంగా పంటలు పూర్తిగా మునిగిపోయాయి. అలాగే ఎక్కువ రోజులు ఉండిపోవడంతో వరి దుబ్బులు కుళ్లిపోయాయి. భారీగా పెట్టుబడులు పెట్టి తీవ్రంగా నష్టపోయాం. ప్రభుత్వం రైతులను మానవతా దృక్పథంతో ఆదుకోవాలి.

– కూత తాతీలు, కౌలు రైతు, రమణక్కపేట

గత ప్రభుత్వంలో అన్ని విధాలా సాయం



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వరదలు, తుపానుల వల్ల పంట నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకున్నారు. తుపాను సమయంలో తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వమే రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసింది. కూటమి ప్రభుత్వం కూడా జరిగిన నష్టానికి పూర్తిగా సాయం అందించి ఆదుకోవాలి. పంట కాలువలను పూర్తిగా ఆధునీకరించాలి.

– పెనుమల్లు వెంకటసూరి, కౌలు రైతు, కొత్తపల్లి మండలం

కంటితుడుపేనా..

భారీ వర్షాల వల్ల ముంపునకు గురైన వరి పంట కుళ్లిపోయింది. ఎన్ని ఎరువులు, పురుగుమందులు పిచికారీ చేసినా పనికి రాదని వ్యవసాయశాఖ అధికారులే చెబుతున్నారు. ఎకరాకు ఇప్పుడున్న మార్గదర్శకాల ప్రకారం కంటితుడుపు చర్యగా రూ.6800 ఇచ్చినా, చంద్రబాబు చెప్పినట్టు రూ.10 వేలు ఇచ్చినా రైతులకు పెట్టుబడి కూడా రాదు. మరో నెల రోజుల్లో పంట చేతికి వస్తుందనుకున్న తరుణంలో ఏలేరు ముంపుతో వరి పంట పూర్తిగా కుళ్లిపోయింది. ఇటువంటి తరుణంలో ఎకరాకు రూ. 25 వేలు నుంచి 30 వేలు పరిహారం ఇస్తే తప్ప రైతులు కోలుకొనే పరిస్థితి ఉండదు. ఈ దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలి.

పరిశుభ్రతతో ఆరోగ్యకర సమాజం

- కలెక్టర్ షణ్మోషన్
- స్వచ్ఛతాహీ సేవ పోస్టర్ ఆవిష్కరణ



స్వచ్ఛతాహీ సేవ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్ తదితరులు

కాకినాడ సిటీ: జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. ఆయన మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా పరిషత్, పంచాయతీ, ఐసీడీఎస్, వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛతాహీ సేవ 2024 పోస్టర్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పరిశుభ్రతతో ఆరోగ్యకర సమాజం ఏర్పడుతుందన్నారు. మంగళవారం నుంచి అక్టోబర్ 2 వరకూ మూడు అంశాలపై స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలను అమలు చేయాలన్నారు. స్వచ్ఛతా భాగిదారి కింద పరిశుభ్రత, పారిశుధ్యం అంశాలపై గ్రామ సభలు నిర్వహించడం, విద్యార్థులతో ర్యాలీలు, క్విజ్ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, ప్రతిజ్ఞ చేయించాలన్నారు. సంపూర్ణ స్వచ్ఛతా కార్యక్రమం కింద గ్రామాల్లో చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావడం, నూతనంగా నిర్మించిన సంపద సృష్టి కేంద్రాలను ప్రారంభోత్సవాలు నిర్వహించాలన్నారు. సఫాయి మిత్ర సురక్ష కార్యక్రమం కింద గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులను సత్కరించడం, శానిటేషన్ కిట్ల పంపిణీ, మహిళలకు వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో డీపీవో కె.భారతీ సౌజన్య, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి, డీఎంహెచ్‌వో జె.నరసింహ నాయక్, ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ పాల్గొన్నారు.

గృహాలను పూర్తి చేయాలి

ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ 2.0 పథకం కింద జిల్లాకు మంజూరు చేసిన గృహాలను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. ఒడిశాలోని భువనేశ్వర్ నుంచి ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద నిర్మించిన గృహాలను మంగళవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. కాకినాడ కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో షణ్మోహన్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన కార్యక్రమం కింద 1,625 గృహాలను పూర్తి చేసి మంగళవారం లబ్ధిదారులకు అప్పగించామన్నారు. వారిచేత గృహ ప్రవేశాలు చేయించడం జరిగిందన్నారు.

పంచాయతీ చట్టాలపై అవగాహన అవసరం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ కృష్ణమోహన్

సామర్లకోట: పంచాయతీరాజ్ చట్టాలపై మండల స్థాయి అధికారులకు అవగాహన ఉండాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ కమిషనర్ ఈ.కృష్ణమోహన్ అన్నారు. శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకూ గల 11 జిల్లాలలోని ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలు, సీనియర్ పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణను మంగళవారం ఆయన ప్రారంభించారు. కృష్ణమోహన్ మాట్లాడుతూ పంచాయతీరాజ్ చట్టం 1994పై పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలన్నారు. ఆయా మండలాలలో వందశాతం ఎస్టీలు ఉన్న ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. పరిపాలనా వికేంద్రీకరణలో భాగంగా వనరుల పంపిణీ సక్రమంగా జరగాలని, ప్రభుత్వ పనుల్లో స్థానికులను భాగస్వాములు చేయాలన్నారు. ఆయా ప్రాంతాలలో పరిశ్రమలు ఏర్పాటైన సమయంలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా ప్రయత్నాలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీలు పి.శ్రీనివాసరావు, జీఎస్ఆర్ శ్రీదేవి, వి.ప్రసాద్, రిసోర్స్‌పర్సన్లు శ్రీనివాసు, సుబ్రహ్మణం పాల్గొన్నారు.

26న రాజమహేంద్రవరానికి వారాహి రథయాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న రమణమూర్తి

సీటీఆర్ఐ: వారాహి శక్తి పీఠం ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన తిరుపతిలో వారాహి రథయాత్రను ప్రారంభిస్తున్నట్టు ఏలూరు జిల్లా పోలవరం మండలం కుంజవరం గ్రామానికి చెందిన బొమ్మా వెంకట రమణమూర్తి వెల్లడించారు. రథయాత్ర అక్కడ నుంచి నెల్లూరు, విజయవాడ, గుంటూరు మీదుగా ఈ నెల 26వ తేదీ నాటికి రాజమహేంద్రవరం చేరుకుంటుందన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 26వ తేదీ ఉదయం కోటిపల్లి బస్టాండ్ వద్దకు రథయాత్ర చేరుకుంటుందని, నగరంలోని ఊరేగింపు అనంతరం సాయంత్రం మున్సిపల్ స్టేడియానికి చేరుకుంటుందన్నారు. అక్కడ సాయంత్రం 5 గంటలకు మహా రుద్రహోమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే భక్తులు ఎటువంటి రుసుము చెల్లించనవసరం లేదని, అల్పాహారం, భోజనంతో పాటు అన్ని సౌకర్యాలను తామే కల్పిస్తామని వివరించారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే వారు 78931 59871, 99596 95256 నంబర్లను సంప్రదించాలని కోరారు.


చిక్కని చిరుతపులి



చిరుతను పట్టుకునేందుకు ఏర్పాటు చేసిన బోను

రాజానగరం: దివాన్ చెరువు రిజర్వు ఫారెస్టులో 12 రోజులుగా సంచరిస్తున్న చిరుతపులి సోమవారం రాత్రి 9 గంటల సమయంలో జాతీయ రహదారి డివైడర్ దాటి అవతలి వైపుకు వెళ్లిందనే సమాచారం ఉందని జిల్లా అటవీశాఖ అధికారి ఎస్.భరణి తెలిపారు. ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ లాలాచెరువు నుంచి ఆటోనగర్ వరకు జాతీయ రహదారిపై ప్రయాణించేవారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పులిని పట్టుకునేందుకు తమ ప్రయత్నాలు కొనసాగుతున్నాయని, ప్రత్యేక బృందాలు నిరంతరం పని చేస్తున్నాయన్నారు. వివిధ ప్రాంతాలలో 50 ట్రాప్ కెమెరాలు బిగించడంతో పాటు అవసరమైనచోట బోన్లు కూడా ఏర్పాటు చేశామన్నారు. అయితే రెండు రోజులుగా దాని కదలికలు ఏ కెమెరాలోనూ నమోదు కాలేదని తెలిపారు.

‘గోల్‌మాల్’పై ఇద్దరికి షోకాజ్ నోటీసులు



కోరుకొండలోని లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం

అన్నవరం: కోరుకొండలోని లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో అన్నదాన పథకానికి భక్తులు సమర్పించిన విరాళాలు, దేవస్థానానికి వచ్చిన ఆదాయం రూ.16 లక్షల గోల్‌మాల్ వ్యవహారంలో ఇద్దరు దేవదాయశాఖ అధికారులకు ఆ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ మంగళవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా అరసవిల్లి దేవస్థానం ఈఓగా పనిచేస్తున్న డిప్యూటీ కమిషనర్ డీఎల్‌వీ రమేష్ బాబు, విజయనగరం జిల్లా రామతీర్థం దేవస్థానం ఈఓగా పనిచేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ వై.శ్రీనివాసరావుకు వీటిని జారీ చేశారు. వీరిద్దరూ అన్నవరం దేవస్థానంలో పనిచేసిన సమయంలో కోరుకొండ ఆలయ వ్యవహారాలను ఏసీ, ఏఈఓ హోదాలో పర్యవేక్షించారు. ఈ వ్యవహారంపై రెండు వారాలలో సంజాయిషీ ఇవ్వాలని కమిషనర్ ఆదేశించారు. కాగా.. విరాళాల గోల్‌మాల్ విషయంపై ఇప్పటికే అన్నవరం దేవస్థానానికి చెందిన జూనియర్ అసిస్టెంట్ కె.సతీష్, రికార్డు అసిస్టెంట్ టి.అనిల్ కుమార్, కోరుకొండ దేవస్థానానికి చెందిన రికార్డు అసిస్టెంట్ టి.రవి కుమార్‌ను అన్నవరం దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. అలాగే కోరుకొండ దేవస్థానం వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న అన్నవరం దేవస్థానం సూపరింటెండెంట్ కె.సూర్యనారాయణ (శివ)కు గతంలోనే షోకాజ్ నోటీసు జారీ చేశారు.

‘మన ప్రభుత్వంలో కోడిపందేలకు సై’

నల్లజర్ల: ‘మన ప్రభుత్వం వచ్చింది. సంక్రాంతి సందర్భంగా సంప్రదాయ క్రీడలు, కోడిపందేలు వేసుకున్నా ఇక ఇబ్బంది ఉండదు’ అని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. కోడిపందాలపై ఆయన చేసిన వ్యాఖ్యలు విని అక్కడున్న వారు ఆశ్చర్యపోయారు. ఎమ్మెల్యే వెంకట్రాజు మంగళవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలలో ప్రోత్సహించేందుకు తన సొంత డబ్బులతోనే పాఠశాలల్లో క్రీడామైదానాలు అభివృద్ధి చేస్తానని, పాఠశాలలకు అన్ని రకాల క్రీడా సామగ్రి కిట్లు అందజేయనున్నట్టు చెప్పారు. గ్రామాలలో యువతను క్రీడలలో భాగస్వాములు చేస్తామన్నారు. దసరా నుంచి సంక్రాంతి వరకు బాగా ప్రాక్టీసు చేయించి పండగ రోజులలో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ ఏడాది నుంచి కోడిపందేలు బెరుగ్గా కాకుండా బహిరంగంగానే వేసుకోవచ్చునన్నారు.

క్లుప్తంగా

22న అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): పాఠశాల క్రీడా సమాఖ్య అండర్–19 ఆధ్వర్యంలో జరగనున్న జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్ల ఎంపికకు షెడ్యూలు విడుదలైనట్టు సంస్థ కార్యదర్శి శివరామకృష్ణ మంగళవారం తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి పరిధిలో డీవీఈఓ జేవీఎస్ఎస్ సుబ్రహ్మణ్యం ఆదేశాల మేరకు ఈ నెల 19న రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బాస్కెట్‌బాల్, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, షటిల్ బ్యాడ్మింటన్, కరాటేలో పీడీ రఘురాం ఆధ్వర్యంలోను, 21న కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఫుట్‌బాల్, జూడో, స్విమ్మింగ్, తైక్వాండో, యోగాలో పీఆర్‌జీసీ పీడీ రత్నశామ్యూల్, సీహెచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలోను, 29న కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్, పవర్ లిఫ్టింగ్, బాక్సింగ్, జిమ్నాస్టిక్స్‌లో ఎంపికలు జరుగుతాయని వివరించారు. 30న పిఠాపురం ఆర్ఆర్‌జీహెచ్ఆర్ జూనియర్ కాలేజీలో ఆర్చరీ, రగ్బీ పీడీలు రత్నశామ్యూల్, వి.సతీష్ ఆధ్వర్యంలో, అక్టోబర్ ఒకటిన కాకినాడ డీఎస్ఏ గ్రౌండ్స్‌లో ఖోఖో, హాకీ, ఫెన్సింగ్, రైఫిల్ షూటింగ్, సాఫ్ట్ టెన్నిస్ బాల్‌లో పీడీలు రత్నశామ్యూల్, సతీష్ ఆధ్వర్యంలో, 16న మండపేట జీజేసీలో టెన్నికాయిట్, త్రోబాల్, బాల్‌బ్యాడ్మింటన్, నెట్‌బాల్‌లో పీడీ ఈవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలోను, 17న పీఆర్ డిగ్రీ కళాశాల, ఆర్ఎంసీ గ్రౌండ్స్‌లో అథ్లెటిక్స్, క్రికెట్, లాన్‌టెన్నిస్, హ్యాండ్‌బాల్‌లో పీడీ రత్నశామ్యూల్, రఘురాం ఆధ్వర్యంలో, 19న జి.మామిడాడ ఫ్యామిలీ హెల్త్ క్లబ్‌లో వాలీబాల్, కబడ్డీ, టేబుల్‌టెన్నిస్, చెస్‌లో పీడీ పి.గంగాధర రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతాయని ఎస్‌జీఎఫ్ఐ తెలిపారు. అక్టోబరు 16, 17, 19 తేదీల్లో జరిగే ఎంపికలు క్వాటర్లీ పరీక్షలు వాయిదా పడిన కారణంగా మార్పులు ఉంటాయన్నారు. అదేవిధంగా జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 22న అండర్–14, 16, 18, 20 విభాగాల్లో అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపికలు కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరుగుతాయి.

పోక్సో కేసులో నిందితుడి అరెస్టు

నల్లజర్ల: మండలంలోని సుభద్రపాలెంలో ఆరేళ్ల చిన్నారిపై లైంగిక దాడి యత్నం కేసులో నిందితుడైన అదే గ్రామానికి చెందిన ఉన్న మట్ట వెంకటనాగేశ్వరరావును సోమవారం అరెస్టు చేసినట్టు సీఐ శ్రీనివాస్ తెలిపారు. నిందితుడిని తాడేపల్లిగూడెం కోర్టులో మంగళవారం హాజరుపర్చారు. మేజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించగా, నిందితుడిని తణుకు సబ్ జైలుకు తరలించారు.

కూటమి గూడుపుఠాణి

గొల్లప్రోలు నగర పంచాయతీలో గడచిన 44 ఏళ్లలో.. ఇళ్ల స్థలం, ఇల్లు ఇచ్చిన ఘన చరిత్రకు సాక్ష్యం గొల్లప్రోలు జగనన్న కాలనీ. ఒకేసారి 2,200 మంది నిరు పేదలకు గూడు కల్పించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కింది. టీడీపీ 14 ఏళ్ల పాలనలో ఒక్కరికీ ఇంటి స్థలం కానీ, ఇల్లు కానీ ఇచ్చిన ఆనవాళ్లు లేవంటున్నారు స్థానికులు. అలాంటి టీడీపీ నేతలు.. వేలాది మందికి నిలువ నీడ కల్పించిన గొల్లప్రోలు జగనన్న కాలనీపై విషం కక్కడంపై కాలనీ వాసులు మండిపడుతున్నారు.

- రూ.30 లక్షల విలువ లేని భూమిని రూ.60 లక్షలకు కొన్నారంటూ విమర్శలు
- వేలాది మందికి గూడు కల్పించిన జగనన్న కాలనీలు
- దారి మునిగితే ఊరంతా మునిగినట్టు టీడీపీ నేతల గోల
- వారి పాలనలో ఒక్క ఇల్లూ ఇవ్వని వైనం
- భూ సేకరణపైనా విషం కక్కుతున్న కూటమి నేతలు
- 40 ఎకరాల భూమిలో 2,200 మందికి పట్టాలిచ్చి, ఇళ్లు నిర్మించిన జగన్


గొల్లప్రోలు నగర పంచాయతీలో నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీ


గొల్లప్రోలు టోల్‌గేట్ వద్ద నీట మునిగిన పవన్ కల్యాణ్ ఇంటి స్థలం

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీ పేరు చెప్పి 1980లో ఇందిరా గాంధీ పాలనలో సుమారు 450 ఇళ్ల స్థలాలిచ్చి ఈబీసీ కాలనీ నిర్మించారు. అనంతరం దఫదఫాలుగా ఇళ్ల నిర్మాణాలు పెరిగాయి. అప్పట్నుంచి ఇప్పటి వరకు ఎవరు పట్టుమని పది ఇళ్లు ఇచ్చిన పాపాన పోలేదని గొల్లప్రోలు వాసులు చెబుతున్నారు. అలాంటిది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదలకు నిలువ నీడ కల్పించాలన్న సదుద్దేశంతో రూ.కోట్లు వెచ్చించి, వేలాది మందికి ఇళ్ల స్థలాలివ్వడమే కాకుండా, ఇళ్లు నిర్మించారు. కాలనీకి మౌలిక సదుపాయాలు కల్పించడానికి అన్ని చర్యలూ తీసుకున్నారు. పనులన్నీ పూర్తి చేసేందుకు సమయం పట్టగా, ఇంతలో ప్రభుత్వం మారి అవన్నీ ఆగిపోయాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ పెద్దలు గొల్లప్రోలు జగనన్న కాలనీపై విషం కక్కడం మొదలెట్టారు. కేవలం కాలువ పొంగి దారి సమస్య ఏర్పడితే, దానిని భూతద్దంలో చూపించి.. కాలనీ అంతా మునిగినట్టు ప్రచారం చేశారు. గతంలో సెంటు భూమి ఇంటికేం సరిపోతుంది, శవాన్ని పూడ్చడానికి తప్ప అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించగా, ఇప్పుడు కూటమి నేతలంతా పేదల గృహాలపై రాజకీయం చేస్తున్నారని కాలనీవాసులు మండిపడుతున్నారు.

మునిగేది రహదారి మాత్రమే..

భౌగోళికంగా గొల్లప్రోలు నగర పంచాయతీ కంటే ప్రస్తుత జగనన్న కాలనీ ఎత్తులో ఉంది. దానిని గృహ నిర్మాణాలకు అనువుగా మరింత ఎత్తు చేశారు. ఎంత పెద్ద వరదొచ్చినా కాలనీలో ఇళ్లు మాత్రం మునిగే అవకాశం లేదంటున్నారు నివాసితులు. కాలనీకి వెళ్లే దారిలో ఉన్న పుంత కాలువకు వరదొస్తే పొంగి పొర్లుతుంది. ప్రస్తుతం అది మాత్రమే కాలనీకి పెద్ద సమస్యగా మారింది. కేవలం వంతెన నిర్మాణం జరగకపోవడం వల్ల వరదొస్తే కాలనీలోకి వెళ్లే దారి లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితిని మసిపూసి మారేడుకాయ చేసి, మొత్తం కాలనీ నీట మునిగి, జనం బాధలు పడుతున్నట్టు చూపించే యత్నం చేశారు టీడీపీ, జనసేన నేతలు.

భూసేకరణపైనా..

గొల్లప్రోలులో ఇల్లు, స్థలం లేని నిరుపేదలు 2 వేలకు పైగా ఉన్నారు. వీరందరికి ఇళ్ల నిర్మాణానికి గత ప్రభుత్వం గొల్లప్రోలు 216 జాతీయ రహదారికి దగ్గరలో 40 ఎకరాల భూమిని ఎకరం రూ.60 లక్షలకు కొనుగోలు చేసింది. అందులో 2,200 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించి, వెంటనే ఇళ్ల నిర్మాణాలు చేపట్టి, రోడ్లు కరెంటు సౌకర్యం కల్పించారు. మంచినీటి పైపులైన్లు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో జగనన్న కాలనీ నిర్మాణానికి కొనుగోలు చేసిన భూమి రూ.30 లక్షలు మాత్రమే విలువ చేస్తుందని, గత ప్రభుత్వం దానిని రూ.60 లక్షలకు కొనుగోలు చేసిందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత ఎస్వీఎస్ఎన్ వర్మతో పాటు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సైతం తీవ్ర విమర్శలు చేశారు. లోతట్టు గొల్లప్రోలు పరిసర ప్రాంతాల్లో పరిశ్రమలు ఎక్కువ. దానివల్ల భూమి రేట్లు ఎప్పుడూ ఎక్కువగానే ఉంటాయి. అలాంటిది గొల్లప్రోలును ఆనుకుని 216 హైవే బైపాస్ రోడ్డు నిర్మాణం జరగడంతో, భూమి రేట్లు ఆకాశాన్నంటాయి. అప్పటి వరకు రూ.50 లక్షలు ఉండే ఎకరం భూమి.. రూ.కోటికి పైగా పలికింది. అలాంటి సమయంలో జగనన్న కాలనీకి భూసేకరణకు యత్నించగా, ఎక్కడా రూ.80 లక్షలకు తక్కువ భూమి ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రాలేదంటున్నారు. దీంతో అప్పటి కలెక్టర్ స్థానిక రెవెన్యూ అధికారులపై తీవ్ర ఒత్తిడి తీసుకురాగా, ప్రస్తుత కాలనీ నిర్మించిన భూమిని రైతులను ఒప్పించి రూ 60 లక్షలకు కొనుగోలు చేసినట్లు రెవిన్యూ అధికారులు తెలిపారు.

మరి ఆయనెందుకు కొన్నట్టో..!?

గొల్లప్రోలు జగనన్న కాలనీ ప్రాంతం రూ 30 లక్షలే అని తీవ్ర విమర్శలు చేసిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. ఇదే ప్రాంతంలో భూమిని ఇంటి నిర్మాణానికి కొనుగోలు చేశారు. ఆయన కొనుగోలు చేసిన భూమి వరదలకు ఆరు అడుగుల మేర మునిగిపోయింది. కాని జగనన్న కాలనీలో రహదారి మినహా ఒక్క ఇల్లూ మునగలేదు. కాగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాత్రం ఏకంగా ఎకరం రూ.కోటిన్నరకు పైగా వెచ్చించి భూమిని కొనుగోలు చేయడంపై స్థానికులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఒకవైపు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ, మరోవైపు అలాంటి భూమినే వారి కంటే ఎక్కువ ధరకు ఎలా కొనుగోలు చేశారంటూ స్థానికులు ఆయనను ప్రశ్నిస్తున్నారు.

మా కాలనీ మునగదు

ఇంత మందికి ఒకేసారి ఇళ్లు కట్టించిన ఘనత జగన్‌కే దక్కుతుంది. కూటమి నేతలు ఆరోపిస్తున్నట్టు ఇక్కడేమీ జరగడం లేదు. ఒక్క రోడ్డు మినహా, అది కూడా పుంత కాలువ వల్ల ఇబ్బంది వస్తోంది. మరేవిధమైన ఇబ్బంది ఉండదు. ఒక పెద్ద కాలనీ నిర్మించినప్పుడు అన్ని సౌకర్యాలు ఒకేసారి ఎవరూ కల్పించలేరు. దఫదఫాలుగా పనులు పూర్తవుతాయి. అసలు ఇక్కడేమీ లేనట్టుగా చెప్పడం ముమ్మాటికీ తప్పు. ఎన్ని వరదలొచ్చినా మా జగనన్న కాలనీ మాత్రం మునగదు. ఎందుకంటే ఈ భూమి గొల్లప్రోలు ఊరు కంటే ఎత్తుగా ఉంటుంది. దానిని మరింత ఎత్తు చేయడం వల్ల కేవలం దారి మాత్రమే మునుగుతుంది. గత ఐదు రోజుల క్రితం వచ్చిన వరద పెద్దగా రావడంతో, దారి మొత్తం మునిగి ఇబ్బందులు పడకతప్పలేదు. కాలనీలో ఒక్క ఇల్లూ నీట మునగలేదు. తప్పుడు ప్రచారాలు చేసి పేదల గృహాలపై విషం చిమ్మడం మానుకోవాలి.

– మొగలి కనకారావు, గొల్లప్రోలు జగనన్న కాలనీవాసి, గొల్లప్రోలు

పనికి రాని స్థలాన్ని పవన్ ఎందుకు కొన్నారు

మేము ప్రభుత్వానికి ఇచ్చిన భూమి పనికి రాదంటున్నారు. మరి అలాంటి పనికి రాని స్థలాన్నే పవన్ కల్యాణ్ ఎందుకు కొన్నారు. గొల్లప్రోలులో రూ కోటిన్నర పైనే భూమి ధర పలుకుతోంది. దానికి నిదర్శనం సాక్షాత్తూ ఉప ముఖ్యమంత్రే అంత రేటుకు కొనుగోలు చేసినట్టు ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. అలాంటిది మేము ఇచ్చిన భూమి మాత్రం రూ 30 లక్షలే అనడం వారి నిరంకుశత్వానికి నిదర్శనం. ఇప్పుడైనా ఫర్వా లేదు. మా భూమి మాకు ఇచ్చేస్తే వడ్డీతో సహా మేము డబ్బులు వెనక్కి కట్టేస్తాం. అయినా ప్రభుత్వానికి భూమి ఇచ్చిన మాకు లేని బాధ వారికెందుకు? మేమేమన్నా మా డబ్బు తినేశారని చెప్పామా? మా భూమికి అప్పట్లో అధికారులు విలువ కట్టి మరీ ఇచ్చారు. రెవెన్యూ అధికారులు పలుమార్లు బతిమాలితే, మా గ్రామంలో పది మందికీ నిలువ నీడ ఏర్పాటు చేయడానికి ఉపయోగపడుతుంది కదా అని మాకు అవసరం లేకపోయినా మా భూములు ఇష్టపడి ఇచ్చాం. వైఎస్ జగన్ మా భూముల్లో మంచి చేశారు. వేలాది మందికి గృహాలు కట్టించారు. అలాంటి కాలనీపై నిజాలు తెలుసుకోకుండా విమర్శలు చేయడం నాయకులకు మంచిది కాదు. చేతనైతే కాలనీ సమస్యలు పరిష్కరించండి అంతేకానీ తప్పుడు ఆరోపణలు చేయవద్దు.

– జ్యోతుల భీముడు, జగనన్న కాలనీకి భూమి ఇచ్చిన రైతు, గొల్లప్రోలు

కూయకుండానే.. రైలొచ్చి వెళ్లింది

- అనౌన్స్‌మెంట్, డిస్‌ప్లే లేని ఏపీ ఎక్స్‌ప్రెస్
- పరుగులు తీసిన ప్రయాణికులు

సామర్లకోట: ఎటువంటి అనౌన్స్‌మెంట్, ప్లాట్‌ఫాంపై డిస్‌ప్లే లేకుండా సామర్లకోట రైల్వే స్టేషన్‌లో సోమవారం అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో ఏపీ ఎక్స్‌ప్రెస్ వచ్చిందని రైలు ప్రయాణికులు ఆరోపించారు. రైలు వచ్చే ముందు బోగీల సమాచారం తెలిసేలా డిస్‌ప్లేతో పాటు, అనౌన్స్‌మెంట్ తప్పనిసరిగా చేయాల్సి ఉంటుంది. విశాఖపట్నం నుంచి న్యూఢిల్లీ వెళ్లే ఏపీ ఎక్స్‌ప్రెస్ వచ్చే ముందు ఇవేమీ చేయలేదని, దీంతో రైలు వచ్చిన విషయాన్ని ఆలస్యంగా గుర్తించి, పిల్లలతో, మహిళలతో పరుగులు తీయాల్సి వచ్చిందని బీజేపీ అనుబంధ యువమోర్చా రాష్ట్ర సభ్యుడు ఎస్ అనిల్‌కుమార్ మంగళవారం ఆరోపించారు. తాము న్యూఢిల్లీ వెళ్లడానికి సోమవారం రాత్రి సామర్లకోట రైల్వే స్టేషన్‌లో వేచిఉన్నామని తెలిపారు. సమాచారం లేకుండా రైలు వచ్చిందని, డిస్‌ప్లే లేకపోవడం వల్ల ఏ బోగీ ఎక్కడ వచ్చిందో తెలియక మహిళలు, పిల్లలతో పరుగులు తీశామని చెప్పారు. దీనిపై న్యూఢిల్లీ వెళ్లాక సామర్లకోట రైల్వే స్టేషన్ మేనేజర్‌ను వివరణ కోరుతామని అనిల్‌కుమార్ స్థానిక విలేకర్లకు ఫోన్‌లో తెలిపారు. ఈ సంఘటనపై రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్‌ను వివరణ కోరగా, రాత్రి డ్యూటీలో ఉన్న సిబ్బందిపై విచారణ చేస్తామని చెప్పారు. ప్రతి రైలుకు తప్పనిసరిగా అనౌన్స్‌మెంట్‌తో పాటు, బోగీల డిస్‌ప్లే వేయాల్సి ఉంటుందన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్టు

రాజానగరం: హైవేను ఆనుకుని ఎస్పీరాజు అపార్టుమెంట్స్ వద్ద ఈ నెల 12న జరిగిన హత్యాయత్నం కేసులో నిందితులను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సీఐ ఎస్.పి.వీరయ్యగౌడ్ మంగళవారం విలేకరులకు వివరాలు తెలిపారు. రంగంపేటకు చెందిన కర్రి శ్రీనివాస్‌కి, సుభద్రంపేటకు చెందిన పూసల సుబ్రహ్మణ్యానికి ఆర్థిక లావాదేవీలున్నాయి. వారం క్రితం సుబ్రహ్మణ్యం తన అనుచరులతో శ్రీనివాస్ ఇంటికి వెళ్లి బాకీ చెల్లించమని దౌర్జన్యం చేశాడు. ఈ విషయాన్ని శ్రీనివాస్ గ్రామ పెద్దలకు చెప్పి, పోలీసులకు ఫిర్యాదు చేయాలని భావించాడు. దీనిపై సుబ్రహ్మణ్యం అతనిపై పగ పెంచుకున్నాడు. తన స్నేహితుడైన కాకినాడ రూరల్ మండలం, తిమ్మాపురానికి చెందిన నందూరి వీరబాబుతో తన పగను , ప్లాన్‌ను చెప్పాడు. ఇందుకు వీరబాబు స్నేహితుడైన కాకినాడ రూరల్‌లోని చీడిగకు చెందిన ముమ్మిడి మణిసాయికి రూ.7 వేలిచ్చి ప్లాన్ చెప్పాడు. వారిద్దరూ ఒకరోజు శ్రీనివాస్ ఉంటున్న జీఎస్ఎల్ ఎదురుగా ఉన్న ఎస్పీ రాజు అపార్టుమెంట్స్ వద్ద రెక్కీ నిర్వహించారు. చివరకు 12వ తేదీ అర్ధరాత్రి 12.45 సమయంలో మణిసాయి, తన స్నేహితులైన పెదపూడి మండలం, కొత్తూరు, రామేశ్వరానికి చెందిన నున్న అభిషేక్, ముమ్మిడి దుర్గాబాబును వెంటేసుకుని వీరబాబుతో కలిసి, వేసిన ప్లాన్ ప్రకారం శ్రీనివాస్‌ని హతమార్చేందుకు సిద్ధమయ్యారు. కారులో ఒంటరిగా వచ్చిన శ్రీనివాస్, అపార్టుమెంట్ గేటు తీస్తుండగా, ఇనుప సుత్తితో అతనిపై దాడి చేశారు. తీవ్ర గాయమైనప్పటికీ అతను తప్పించుకుని ప్రాణాలు కాపాడుకున్నాడు. నిందితులు మారణాయుధాన్ని అక్కడున్న కాలువలో పారేసి, పరారయ్యారు. బాధితుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ వీరయ్యగౌడ్ ఆధ్వర్యంలో ఎస్సై మనోహర్, సిబ్బంది బృందంగా వెళ్లి నిందితులను రెండు రోజుల్లోనే పట్టుకున్నారు.

ఓటర్ల తుది జాబితా రూపకల్పన

- తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు కీలక ప్రక్రియ
- కలెక్టర్ ఆర్ మహేష్‌కుమార్


రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: తూర్పు–పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించిన తాజా ఓటర్ల జాబితా రూపకల్పనకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసినట్టు కలెక్టర్ ఆర్ మహేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం తన చాంబర్‌లో ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటరు నమోదు ప్రక్రియకు సంబంధించి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ తూర్పు, పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి అర్హత తేదీ నవంబర్ ఒకటిగా ఎన్నికల సంఘం నిర్ధారించిందన్నారు. ఈ మేరకు పబ్లిక్ నోటిఫికేషన్ జూలై 29న జారీ చేసిందన్నారు. ఆగస్టు 13న, 23న రెండుసార్లు పత్రికల్లో ప్రచురించారన్నారు. ఫారం–19లో దరఖాస్తుల స్వీకరణను ఈ నెల మూడు వరకు చేపట్టినట్టు చెప్పారు. ఈ నెల 24న ఓటరు జాబితా ముసాయిదా ప్రచురిస్తారని వెల్లడించారు. క్లయిములు, అభ్యంతరాలు దాఖలు చేసేందుకు ఈ నెల 24 నుంచి అక్టోబర్ 15 వరకు అవకాశం ఉందన్నారు. తుది జాబితా నవంబర్ 6న ప్రచురిస్తారని తెలిపారు. ప్రతి మండలంలో ఒక్కొక్క కేంద్రం చొప్పున 22 పోలింగ్ కేంద్రాలు ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటింగ్ కోసం ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఎటువంటి అభ్యంతరాలకు తావు లేకుండా చర్యలు తీసుకుంటామని రాజకీయ పార్టీల ప్రతినిధులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సంసాని నాని, షేక్ అబ్దుల్ ఖాదర్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు రాజేష్, కారెం వెంకటేశ్వరరావు, భవాని, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

హాస్య నట చక్రవర్తి రేలంగి

- గోదావరి గట్టున తెలుగు సినీ హాస్య దిగ్గజం కాంస్య విగ్రహం
- రాజమహేంద్రవరంలో రేపు ఆవిష్కరణ


కొత్తపేటలో రూపుదిద్దుకున్న రేలంగి వెంకట్రామయ్య కాంస్య విగ్రహం

కొత్తపేట: తెలుగు సినీ హాస్య దిగ్గజం రేలంగి వెంకట్రామయ్య. సుమారు వందేళ్ల తెలుగు సినీ చరిత్రలో ప్రముఖ హాస్య నటునిగా, హాస్య పితామహునిగా సుస్థిర స్థానం సొంతం చేసుకున్నారు. సినీ పరిశ్రమకు ఎందరు హాస్యనటులు వచ్చినా.. ఆయనకు ఆయనే సాటి అన్నట్టుగా రేలంగి గుర్తింపు పొందారు. ఉభయ గోదావరి జిల్లాలకు చిరపరిచితుడైన రేలంగి అభిమానులు, రాజమహేంద్రవరం గౌడ, శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో గోదావరి గట్టున దివంగత సినీ ప్రముఖుల విగ్రహాల సరసన రేలంగి వెంకట్రామయ్య కాంస్య విగ్రహాన్ని గురువారం ఉదయం 10.30కు ప్రముఖుల చేతులు మీదుగా ఆవిష్కరించనున్నారు. 8 అడుగుల రేలంగి విగ్రహాన్ని కొత్తపేటలో ప్రముఖ అంతర్జాతీయ శిల్పి డి.రాజ్ కుమార్ వుడయార్ రూపొందించారు. ఇది రేలంగి తొలి కాంస్య విగ్రహమని శిల్పి రాజ్‌కుమార్ 'సాక్షి'కి తెలిపారు.

కృష్ణతులాభారం చిత్రం ద్వారా..

నాడు తూర్పుగోదావరి జిల్లా కొత్తపేట తాలూకా రావులపాడు (రావులపాలెం మండలం) గ్రామంలో రామదాసు (రామస్వామి), అచ్చయ్యమ్మ దంపతులకు 1910 ఆగస్టు 13న రేలంగి జన్మించారు. ఆయన భార్య బుచ్చియ్యమ్మ. కుమారుడు సత్యనారాయణబాబు. రేలంగి రంగస్థల నాటకాలపై మక్కువతో అతి చిన్న వయసులోనే కలకత్తా వెళ్లి నాటక రంగంలో ప్రవేశించారు. 1935లో దర్శకుడు సి.పుల్లయ్య, రేలంగిని కృష్ణతులాభారం చిత్రం ద్వారా సినీ పరిశ్రమకు పరిచయం చేశారు. 1948లో వచ్చిన వింధ్యరాణి సినిమాతో ఆయన సినీ కెరీర్ విజయాల బాట పట్టింది. దాదాపు 300కు పైగా చిత్రాల్లో నటించారు. 1954లో భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పద్మశ్రీ అవార్డును దేశంలోనే కళా రంగం నుంచి హాస్య నటునిగా అందుకున్న ఘనత రేలంగికే దక్కింది. ఇది తెలుగు వారికి గర్వకారణమైంది. ఆ సందర్భంగా మద్రాస్ పురవీధుల్లో తెలుగు, తమిళ మహానటుల నడుమ రేలంగిని అంబారీపై ఊరేగించి, విజయా గార్డెన్స్‌లో ఘనంగా సన్మానించారు.

హీరోలతో సమానంగా పారితోషికం

సుమారు 35 ఏళ్ల పాటు తెలుగు సినీ పరిశ్రమలో హాస్య, క్యారెక్టర్ పాత్రలకు రేలంగి పెట్టింది పేరు. జాతీయ స్థాయిలో అవార్డులు పొందిన నర్తనశాల, మాయాబజార్, లవకుశ, హరిశ్చంద్ర, సువర్ణ సుందరి, అప్పు చేసి పప్పుకూడు, మిస్సమ్మ వంటి మరపురాని సినిమాల్లో నటించారు. పూజ ఆయన నటించిన చివరి సినిమా. అప్పట్లో మేటి హీరోలతో సమానంగా పారితోషికం తీసుకున్న హాస్య నటుడు రేలంగి మాత్రమే. మద్రాసులో రేలంగి ఇంటి వద్ద నిత్యాన్నదానం జరిగేది.

రాజమహేంద్రవరంతో అనుబంధం

పౌరాణిక రంగస్థలం, సాంఘిక నాటక కళాకారుడు, తెలుగు సినీ హాస్య నటుడు రేలంగికి కళలకు పుట్టినిల్లు అయిన రాజమహేంద్రవరంతో ప్రత్యేక అనుబంధం ఉండేది. ఆయనకు ఇక్కడ లలిత కళా నికేతన్ వారు హాస్య బ్రహ్మగా పేరుగాంచిన భమిడిపాటి కామేశ్వరరావు చేతుల మీదుగా హాస్య నట చక్రవర్తి అనే బిరుదును ప్రదానం చేశారు. అదే సభలో రేలంగిని గోదావరి జిల్లాల అభిమానులు సువర్ణ కంకణంతో ఘనంగా సత్కరించారు. గోదావరి జిల్లాలపై ఉన్న మమకారంతో ఆయన తాడేపల్లిగూడెంలో రేలంగి చిత్ర మందిర్ పేరుతో థియేటర్‌ను నిర్మించారు. అక్కడే స్థిరపడ్డారు. 1975 నవంబర్ 27న తాడేపల్లిగూడెంలోని తన స్వగృహంలో వయోభారంతో తుది శ్వాస విడిచారు. తెలుగు సినీ ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారు.